

కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లా రద్దు

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే వికారాబాద్ జిల్లాను రద్దు చేస్తారని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఆందోళన వ్యక్తం చేశారు. 10లో▸



సభను సక్సెస్ చేయాలి

వికారాబాద్‌లో ఈ నెల 11న జరిగే అమిత్‌షా సభను సక్సెస్ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి కోరారు. 10లో▸



నిధులకు మోక్షమెప్పుడు?

జాతీయ స్థాయి ప్రమాణాలను పాటించే ఆస్పత్రుల అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు కావడం లేదు. 11లో▸

యువ.. హవా!

చేవెళ్ల లోక్‌సభ పరిధిలో యువ ఓటర్లే కీలకం

- 39 ఏళ్లలోపు వారు 15,20,890 మంది
- వీరు ఎవరి వైపు మొగ్గు చూపితే వారికే విజయావకాశాలు
- యువతే టార్గెట్‌గా ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం



వికారాబాద్: చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో యువ ఓటర్లే కీలకం కాబోతున్నారు. వారు ఎటువైపు మొగ్గు చూపితే.. ఆ పార్టీ అభ్యర్థికే విజయావకాశాలు ఎక్కువగా ఉండనున్నాయి. దీంతో ఆయా పార్టీల అభ్యర్థులు సైతం యువతే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. మెజార్టీ ఓట్లు సాధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు కొనసాగుతుండగా, వీటిలో మొత్తం 29,38,370 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 15,04,260 మంది పురుషులు ఉండగా, 14,33,830 మంది మహిళలు, 280 మంది ఇతరులు ఉన్నారు. 18 నుంచి 39 ఏళ్లలోపు వారు 15,20,890 మంది (52శాతం) ఉండటం విశేషం. ఓటు హక్కు వినియోగించుకునే అంశంపై ఇప్పటికే వీరంతా ఓ స్పష్టతకు రావడంతో పాటు కుటుంబ సభ్యులు, నివాస ప్రాంతాన్ని, సామాజిక వర్గాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. దీంతో ఆయా పార్టీల అభ్యర్థులు ఈ యువత నే ప్రధానంగా దృష్టిలో పె ట్టుకుని ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మెగా డీఎస్సీ వేయనున్నట్లు ప్రచారం చేస్తుండగా, బీజేపీ అభ్యర్థి మోదీ సాధించిన విజయాలు, స్వయం ఉపాధి, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటును ఎజెండాగా చేసుకుని ప్రచారం చేస్తున్నారు. ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థి సాగు నీరు, ఉచిత కరెంట్, రియల్ ఎస్టేట్, ప్రభుత్వ ఉద్యోగాలు వంటి అంశాలను ప్రచారం చేస్తున్నారు.

268 మంది శతాధిక వృద్ధులు

లోక్‌సభ స్థానంలో యువ ఓటర్లే కాదు.. శతాధిక వృద్ధులు కూడా ఉన్నారు. మహేశ్వరంలో 95 మంది, రాజేంద్రనగర్‌లో 65 మంది, శేరిలింగంపల్లిలో 8 మంది, చేవెళ్లలో 93 మంది, వికారాబాద్‌లో ఐదుగురు, తాండూరులో ముగ్గురు ఉన్నట్లు ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితాలో వెల్లడైంది. వీరిలో మెజార్టీ ఓటర్లకు పుట్టిన రోజు ధ్రువపత్రాలు లేకపోవడం, ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో ఏదో ఒక సంవత్సరం, తేదీ పేర్లు చెప్పడం, ఎన్నికల అధికారులు కూడా ఇవేవీ పట్టించుకోకుండా గుడ్డిగా వారి పేర్లతో పాటు వయసు నమోదు చేశారు. నిజానికి వీరి వయసు వందేళ్ల లోపే ఉండగా, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా అధిక వయసు నమోదైనట్లు సమాచారం. ఇక 90 నుంచి 99 ఏళ్ల వయసు వారు 4,759 మంది ఉండటం విశేషం.

బరిలో 43 మంది.. ప్రచారంలో ముగ్గురే

బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు మినహా క్షేత్రస్థాయి ప్రచారంలో ఇతరులు పెద్దగా కన్పించడం లేదు. క్షేత్రస్థాయిలోనే కాదు కనీసం సోషల్ మీడియాలోనూ వీరి ప్రచారం కన్పించక పోవడాన్ని పరిశీలిస్తే వీరంతా పేరుకే పోటీ చేస్తున్నట్లు కనిపిస్తోంది. పోటీ చేస్తున్న వారిలో మెజార్టీ అభ్యర్థులు 40 ఏళ్లలోపు వారే. పీజీ, పీహెచ్‌డీ, ఎంబీఏ, బీటెక్ వంటి ఉన్నత కోర్సులు పూర్తి చేసిన వారే ఉండటం గమనార్హం.

వయసు వారీగా ఓటర్లు

నియోజకవర్గం	18–19	20–29	30–39	40–49	50–59	60–69	70–79	80–89	90–99	100–120
వికారాబాద్	7,081	50,173	69,561	44,148	31,551	18,491	8,390	1,937	301	05
పరిగి	10,368	62,369	77,230	50,845	33,269	20,423	9,483	2,249	321	00
తాండూరు	8,716	57,625	71,011	47,974	32,034	17,191	7,556	1,754	228	03
మహేశ్వరం	50,963	1,04,113	1,64,775	1,21,057	77,682	45,610	22,465	6,400	1,236	95
రాజేంద్రనగర్	55,568	1,13,241	1,92,334	1,41,689	80,468	45,070	20,191	4,522	791	65
శేరిలింగంపల్లి	54,138	1,12,281	2,39,949	1,93,788	99,951	59,885	30,233	7,779	1,304	08
చేవెళ్ల	28,822	57,685	70,239	55,732	39,153	23,535	11,353	3,339	578	93

న్యూస్‌రీల్

అవినీతిరహిత పాలన బీజేపీతోనే సాధ్యం



కుల్కచర్లలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కుల్కచర్ల: అవినీతిరహిత పాలన బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదె మైపాల్, గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జానకీరాం అన్నారు. మంగళవారం కుల్కచర్లలో బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం కోసం, ధర్మం కోసం బీజేపీకి ఓటు వేయాలని కోరారు. యువత మొత్తం మోదీ నాయకత్వాన్ని కోరుకుంటోందని అన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాల్సిన అవసరం ఉందన్నారు. అవకాశవాదులకు, అవినీతిపరులకు ఓటు వేస్తే భవిష్యత్ అంధకారంలోకి వెళుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి సంగెం శ్రీను, నాయకులు కాటనిపల్లి మైపాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



బాలంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న డీకే అరుణ

దౌల్తాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని ఆ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. మంగళవారం మండలంలోని గోకఫసల్‌వాద్, బాలంపేట, బిచ్చాల, చంద్రకల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎక్కడికి వెళ్లినా బీజేపీకి ఆదరణ లభిస్తోందని తెలిపారు. ముచ్చటగా మూడో సారి మోదీ ప్రధాని అవుతారని అన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు కొడంగల్‌కు ఎన్నో నిధులు తెచ్చి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

దౌల్తాబాద్: మండలంలోని చంద్రకల్ చెక్ పోస్టు వద్ద మంగళవారం రూ.94,550 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం గుర్మిట్‌కల్ నుంచి కారులో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రూ.50 వేల మించి నగదు తరలించరాదని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ముత్తురాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో వర్షం



అనంతగిరి: వికారాబాద్‌లో మంగళవారం రాత్రి వర్షం కురిసింది. దీంతో వాతావరణమంతా ఒక్కసారిగా చల్లబడింది. ప్రజలు ఎండ నుంచి కాస్తా ఉపశమనం పొందారు.

నేడు షాద్‌నగర్‌కు అస్సాం ముఖ్యమంత్రి రాక

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం షాద్‌నగర్ పట్టణానికి అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వాస్ శర్మ విచ్చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెబాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్రం 7గంటలకు షాద్‌నగర్ పట్టణంలో కార్నర్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి అస్సాం ముఖ్యమంత్రితో పాటు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ హాజరు కానున్నట్లు తెలిపారు.



అనంతగిరి: ఎన్నికల ఏర్పాట్లపై చర్చిస్తున్న రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి

ఎన్నికలకు సన్నద్ధం కండి

రంగారెడ్డి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక సూచించారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి పట్టణంలోని స్ట్రాంగ్ రూమ్, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13న జరిగే పోలింగ్‌కు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరం మేరకు సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఈవీఎంలను తరలించే సమయంలో సిబ్బంది జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసినహెల్ప్ డెస్క్‌లను సందర్శించారు. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి, జెడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల అధికారులు సాజిదా బేగం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

అధికారులు సమన్వయంతో పనిచేసి లోక్‌సభ ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం పరిగి తహసీల్దార్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు ఇన్‌చార్జ్ లోకేషన్ అధికారిని నియమించాలన్నారు. రూరల్ పరిధిలో ఎంపీడీవో, అర్బన్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు ఇన్‌చార్జులుగా నియమించి ఆ జాబితా పంపాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అన్ని వసతులు కల్పించడం తోపటు అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు నమోదు చేయాలన్నారు. దివ్యాంగుల కోసం వీల్ చైర్లు సమకూర్చాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పకడ్బందీ ఏర్పాట్లు

తాండూరు టౌన్: లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి శశాంక తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతిలతో కలిసి తాండూరులో పర్యటించారు. పట్టణంలోని ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్, పోలింగ్ కేంద్రాన్ని, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ని పరిశీలించారు. అనంతరం ఈవీఎంల పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్లు తారాసింగ్, కిషన్ నాయక్, మునీరుద్దీన్, వెంకటేశం, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

పరిగి: లోక్‌సభ ఎన్నికలు సజావుగా, పకడ్బందీగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక సూచించారు. పట్టణంలోని ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయని వారి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల్లో బరిలో 43 మంది అభ్యర్థులు ఉన్నారని, పోలింగ్ కేంద్రంలో మూడు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని వివరించారు. అనంతరం మినీ స్టేడియంలోని స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఏఆర్‌ఓ వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అలకభూనేటి

- ప్రచారానికి దూరంగా భూనేటి మారుతీకిరణ్
- ఎన్నికల వేళ కమలానికి దెబ్బేనంటున్న కార్యకర్తలు



మారుతీకిరణ్

పరిగి: బీజేపీ నియోజకవర్గ నేత, గత అసెంబ్లీ ఎన్నికల్లో పరిగి నుంచి పోటీ చేసిన అభ్యర్థి భూనేటి మారుతీకిరణ్ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. నియోజకవర్గంలో జరిగే పార్టీ కార్యక్రమాల సమాచారం ఇవ్వకపోవడంతో అలిగినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో మంచి పట్టు ఉన్న నాయకుడు పార్టీ కార్యక్రమాలు, ప్రచారానికి దూరంగా ఉండటంతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. జిల్లా అంతటా బీజేపీ ప్రచారంలో దూసుకుపోతుంటే పరిగి నియోజకవర్గంలో మాత్రం ఆ జోరు కనిపించడం లేదు. నాయకుల మధ్య అంతర్గత విభేదాలే ఇందుకు కారణమని తెలుస్తోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు గ్రామాల్లో జోరుగా ప్రచారం చేస్తుంటే బీజేపీ నాయకులు మాత్రం కనిపించడం లేదని సొంత నాయకులే వాపోతున్నారు. పోలింగ్‌కు కేవలం ఐదు రోజులు మాత్రమే గడువు ఉండటంతో బీజేపీ కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. నియోజకవర్గ ముఖ్య నాయకులకు సమాచారం ఇవ్వకుండా మండల కేంద్రాలు, గ్రామాల్లో ప్రచారం నిర్వహించడం ఏంటని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. పార్టీని నమ్ముకున్న తమకు దక్కే గౌరవం ఇదేనా అని పలువురు నిలదీస్తున్నారు.

పార్టీ కార్యక్రమాలకు దూరంగా..

బీజేపీ నేత మారుతికిరణ్ రెండేళ్ల నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. నాయకులు, కార్యకర్తలను ఒక్కతాటిపైకి తెచ్చి నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేశారు. ప్రతి గ్రామంలో తనకంటూ సొంత క్యాడర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఓట్లు సాధించారు. అయితే కొంతమంది పార్టీ నేతలు లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో అతన్ని దూరం పెడుతూ వచ్చినట్లు సమాచారం. ఈ కారణంగానే తాను పార్టీ కార్యక్రమాలకు వెళ్లడం లేదని తెలిసింది. పార్టీ కోసం కష్టపడిన వారిని పట్టించుకోకపోవడం దారుణమని కార్యకర్తలు అంటున్నారు. గ్రామాల్లో మంచి పట్టు ఉన్న మారుతికిరణ్ సేవలను లోక్‌సభ ఎన్నికల్లో ఉపయోగించుకోకపోడం నష్టమేనని పలువురు పేర్కొన్నారు. పార్టీలో నెలకొన్న అంతర్గత పోరు ఎంపీ ఎన్నికలపై ప్రభావం చూపుతుందని ఎన్నికల విశ్లేషకులు భావిస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్లు నిర్భయంగా ఓటేయాలి

- రంగారెడ్డి జిల్లా సంక్షేమాధికారి పద్మజ

ఇబ్రహీంపట్నం రూరల్: ట్రాన్స్‌జెండర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా సంక్షేమాధికారి పద్మజ పేర్కొన్నారు. సరూర్‌నగర్‌లోని మహిళా సాధికారిత కేంద్రంలో మంగళవారం ట్రాన్స్‌జెండర్లకు ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఉచిత ట్రాన్స్‌జెండర్ సర్టిఫికెట్లు, ఐడీ కార్డులు అందజేశారు. అనంతరం పద్మజారమణ మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్న వారు తప్పకుండా ఓటు వేయాలని సూచించారు. మహిళా సాధికారిత కేంద్రంలో ట్రాన్స్‌జెండర్స్ కోసం తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ట్రాన్స్‌జెండర్స్ ఎక్కడైనా వివక్షకు గురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం కావాల్సిన అఫిడవిట్లు, నోటరీపత్రాలను క్వీర్ బందు పేరెంట్స్ అసోసియేషన్ సంస్థ వ్యవస్థాపకురాలు ముకుందమాల ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ శ్రీదేవి, సీడీపీఓలు, మహిళా సాధికారిత సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి పద్మజారమణ

మోసపోతే.. గోసపడతాం

- ఎక్కడికి వెళ్లినా బీఆర్‌ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు
- విలేకరుల సమావేశంలో మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి



పరిగి: మాట్లాడుతున్న సబితారెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి కసాని జ్ఞానేశ్వర్, మహేశ్‌రెడ్డి, స్వామిగౌడ్

పరిగి/కుల్కచర్ల: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సబితారెడ్డి ఆరోపించారు. మంగళవారం కుల్కచర్లలో ప్రజా ఆశీర్వద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హామీలు అమలు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కితే.. ఇచ్చిన మాటలకు విలువలేని సర్కారుగా కాంగ్రెస్ ప్రభుత్వానికి పేరు వచ్చిందని ఎద్దేవా చేశారు. ప్రజలకు సేవ చేసే నాయకుడు కావాలో.. మోసం చేసే నాయకులు కావాలో ప్రజలు ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, స్వామిగౌడ్, కుల్కచర్ల జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు వీరేష్, అనిల్‌రెడ్డి, రాజు, వెంకట్, రాజప్ప, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తెలంగాణను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దింది కేసీఆరే

దేశంలో తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దింది బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆరేనని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తోందని ఆరోపించారు. మంగళవారం పరిగి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి నివాసంలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్‌కి మేమున్నామని ప్రజలు భరోసా ఇస్తున్నారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా బీఆర్‌ఎస్ హయాంలో సంక్షేమ పథకాలు అమలు చేశామని గుర్తు చేశారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా ఆరు గ్యారంటీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం చేవెళ్ల బరిలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను కేసీఆర్ తీసుకువచ్చిన వారే అని, చేవెళ్ల గడ్డ కేసీఆర్ ఎవరిని నిలబెడితే వారే విజేతలన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వికారాబాద్ జిల్లా కోసం ఎంతో మంది నాయకులు ప్రయత్నం చేసినా ఫలితం లేదన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాకే వికారాబాద్ జిల్లా అయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలను కుదిస్తామని చెబుతోందని, ఇంతకీ వికారాబాద్ జిల్లా ఉంటుందా లేదా అని ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలన్నారు. కేసీఆర్ రాష్ట్రంలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలనే లక్ష్యంతో కాళేశ్వరం, పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను రూపొందించారని తెలిపారు. మొదటి దశలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేశారని, రెండో దశలో పాలమూరు – రంగారెడ్డి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతోనే ఆలస్యం జరిగిందన్నారు. రాష్ట్రానికి ఒక్క సాయం చేయని బీజేపీకి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. తెలంగాణను తెచ్చింది, అభివృద్ధి చేసింది కేసీఆరే అని అన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించాలంటే బీఆర్‌ఎస్ ఎంపీలు ఉండాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల అభివృద్ధే లక్ష్యం: రంజిత్‌రెడ్డి

మొయినాబాద్: చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం అభివృద్ధే తన లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు చిలుకూరు బాలాజీ దేవాలయంలో పూజలు చేశారు. ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రజలకోసమే నిరంతరం పనిచేస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికోసం ఇప్పటికే పలు కంపెనీలను తేవడం జరిగిందని.. భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులు తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీం భరత్, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు కోట్ల నరోత్తంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్‌లు రామకృష్ణగౌడ్, వీరభద్రస్వామి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, నాయకులు

క్లుప్తంగా

రైతులకు ఉపయోగపడే పనులు చేయండి

తాండూరు ఎంపీడీఓ విశ్వప్రసాద్



గ్లూకోజ్ ప్యాకెట్లు అందజేస్తున్న విశ్వప్రసాద్

తాండూరు రూరల్: ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులు చేయాలని కూలీలకు ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం గుంతబాసుపల్లి, మిట్టబాసుపల్లి, కోటబాసుపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంట పొలాలకు రహదారి, కాలువలు, పూడికతీత, డైవర్షన్ డ్రెయిన్ లాంటి పనులు చేయించాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి 11వరకూ పని చేస్తే ఒక్కో కూలీకి రూ.300 ఇస్తారన్నారు. ఇంటి నుంచి వచ్చే కూలీలు ఉప్పు, చక్కెరతో కలిపిన నీటిని తీసుకొని వడదెబ్బ తగలకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి పని కల్పిస్తామన్నారు. అనంతరం ఉపాధి కూలీలకు గ్లూకోజ్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన డీఎస్పీ

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా వికారాబాద్ పీఎస్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆలంపల్లి, రామయ్యగూడ, బాలిక ఉన్నత పాఠశాలలను సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఆయన వెంట వికారాబాద్ సీఐ నాగరాజు ఉన్నారు.

రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగులు అండగా ఉండాలి

అనంతగిరి: రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను కాంగ్రెస్ పార్టీ పరిష్కరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హనుమంతు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు సాయన్న, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డి ట్రాక్టర్ దగ్ధం

మొండిగౌరెల్లిలో రూ.5 లక్షల మేర నష్టం



మంటల్లో కాలిపోతున్న ట్రాక్టర్

యాచారం: గడ్డితో వెళుతున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగలడంతో ప్రమాదవశాత్తు కాలి బూడిదయింది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన మాదం బుచ్చయ్య పశువుల కోసం ఓ రైతు వద్ద పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి మంగళవారం సాయంత్రం మేకల రాములు ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్నారు. అప్పటికే ఈదురుగాలులు వీయడంతో ఈ క్రమంలో గ్రామ సమీపంలోని రోడ్డు మధ్యలో పైన ఉన్న విద్యుత్ వైర్లు గాలికి అటు, ఇటు ఊగి మంటచెలరేగి ట్రాక్టర్‌లో గడ్డికి అంటుకున్నాయి. దీంతో వేగంగా మంటలు వ్యాప్తి చెందాయి. గమనించిన స్థానికులు నీళ్లతో మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌తో పాటు గడ్డి పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.5 లక్షలకు పైగానే నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ సంఘటనా స్థలానికి వెళ్లి బాధితులను ఆదుకోవాలని కోరారు.

గాయపడిన వ్యక్తి మృతి

- బీఆర్ఎస్ మీటింగ్‌కు వెళ్లి మరుగుతున్న కూర పాత్రలో పడ్డ మల్లయ్య
- తీవ్రగాయాలతో ఉస్మానియాకు తరలింపు
- చికిత్స పొందుతూ మృత్యువాత



చికిత్స పొందుతున్న మల్లయ్య (ఫైల్)

ధారూరు: మరుగుతున్న కూర పాత్రలో పడి తీవ్ర గాయాలపాలైన వ్యక్తి సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మంగళవారం పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికివెళ్లి శవ పంచానామ చేసి పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కుక్కింద గ్రామానికి చెందిన గొర్రెంకల మల్లయ్య(45) ఈ నెల 2న ధారూరు మండల కేంద్రంలో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మెతుకు ఆనంద్‌లు పాల్గొన్న సమావేశానికి వెళ్లాడు. సమావేశం ముగియగానే అందరితో పాటు భోజనానికి వెళ్లాడు. వందల మంది ఒక్కసారిగా భోజనం కోసం ఎగబడ్డారు. అక్కడ మల్లయ్య అతికష్టం మీద భోజనం వడ్డించుకుని చికెన్ కోసం వేడిగా ఉన్న పాత్ర దగ్గరకి వెళ్లాడు. తోపులాటలో అదుపు తప్పి చికెన్ పాత్రలో పడిపోయాడు. వేడిగా ఉన్న చికెన్ కూరలో పడిన మల్లయ్య కాళ్లు, చేతులు, నడుము భాగం కాలిపోయింది. వెంటనే అక్కడున్న వారు దాన్ని గమనించి అతనిని 108వాహనంలో వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేసిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో అదేరోజు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అతనికి తోడుగా ఉన్న తల్లి రాజమ్మ అక్కడే అదృశ్యమైంది. ఆమె రెండో కొడుకు క్రిష్ణ అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆసుపత్రి సిబ్బంది అంతగా పట్టించుకోకపోవడం, నిరాధారణకు గురైన మల్లయ్య మృతి చెందాడని గ్రామస్థులు ఆరోపించా రు. మృతుని అన్న క్రిష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

అనాథను ఆదుకోండి: మండల పరిషత్ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు

మల్లయ్య వివాహం చేసుకున్నా భార్య పిల్లలతో కలిసి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని, తండ్రి లేక, వయో వృద్ధురాలు తల్లి ఉన్నా లాభం లేక, అన్నలు పట్టించుకోక నిరాధారణకు గురయ్యాడు. ఒంటరిగా ఉన్న అతను అనాథగా మారాడని మండల పరిషత్ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పట్లోళ్ల బసప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అతని తల్లికి రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు.

దయాకర్ వ్యాఖ్యలు బాధాకరం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

విశ్వహిందూ పరిషత్ మాజీ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య

కుల్కచర్ల: హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా అద్దంకి దయాకర్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని విశ్వహిందూ పరిషత్ మాజీ జిల్లా అధ్యక్షుడు, బీజేపీ నేత ఘణపురం వెంకటయ్య పేర్కొన్నారు. వెంటనే అతినిపై చర్యలు తీసుకొని అరెస్టు చేయాలన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం ఘణపూర్ గ్రామంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాస్టర్ల మాటలకు ప్రభావితమై శ్రీరాముడిపై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని, వెకిలిగా మాట్లాడటం సబబుకాదన్నారు. ఇలాంటి ఇబ్బందికర వాఖ్యలను విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. హిందూ మతంపై వాఖ్యలు చేయడం పట్ల 100కోట్ల మందిని అవమానపరచడమేనన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన అద్దంకి దయాకర్‌పై చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ వ్యవస్థా ప్రముఖ్ రాజేశ్వర్, చీరుపు శ్రీనివాస్, వార్ల ఆంజనేయులు, రాములు, ఆంజనేయులు, లక్ష్మయ్య, హన్మంతు, వార్ల భీమయ్య, మహేశ్ కుమార్, వెంకటేశ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లా రద్దు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



కేసారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే వికారాబాదు జిల్లాను రద్దు చేస్తారని మాజీ ఎమ్మెల్యే డాక్టరు మెతుకు ఆనంద్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని దుర్గంచెరువు, కేసారం గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు పాలన చేరువ చేసేందుకు జిల్లాలను ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ మాత్రం జిల్లాలను కుదించేందుకు కుట్ర చేస్తుందన్నారు. వికారాబాదు జిల్లాను రద్దు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులకు రూ.4వేల పింఛన్, ప్రతి మహిళకు రూ.2,500లు, నిరుద్యోగులకు రూ.3వేల భృతి, కల్యాణ లక్ష్మికి అదనంగా తులం బంగారం, రైతు భరోసా కింద రూ.15వేలు ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆడ లేక మద్దెల అన్నట్లు చేతకాని హామీలు ఇచ్చి ఇప్పుడు దేవుని మీద ఒట్లు ఎందుకు వేయాల్సి వస్తుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రైతులకు రైతు బంధు మొదలు కొని పండించిన పంట కొనుగోలు వరకూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉండేదన్నారు. కరెంటు ఉండదు, పారుకం పారదు రైతు ఎలా వ్యవసాయం చేయాలని ఆయన ప్రశ్నించారు. కాబట్టి కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకట్, యువ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచులు హరిశంకర్, కాశీరాం, అనంతయ్య, లక్ష్మయ్య, కిష్టయ్య, అనిల్‌కుమార్, శంకరయ్య, అభిషేక్, సల్మాన్, రియాజ్, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కుల్కచర్ల: మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి..మంగళవారం కుల్కచర్ల మండలం అనంతసాగర్ గ్రామ అటవీ ప్రాంతంలో కొందరు మేకలకాపరులకు కుళ్లిన శవం కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆమె చాలరోజుల క్రితం మృతిచెంది ఉండొచ్చని తెలిపారు. సుమారు మృతురాలి వయస్సు (60) ఉంటుందని, అట్టి మహిళను కొద్దిరోజుల క్రితం గాధిర్యాల్ ప్రాంతంలో తిరిగినట్లుగా కొందరు చెప్పారు. ఎవరికైనా ఆమె ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కుల్కచర్ల ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి



లక్ష్మి (ఫైల్)

దోమ: చికిత్స పొందుతూ మహిళ మృతిచెందిన సంఘటన దోమ మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..దోమ మండలం బొంపల్లి గ్రామానికి చెందిన ముద్దం లక్ష్మి(32) కుటుంబ కలహాలతో క్రిమీసంహారక మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను పరిగి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గాంధి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కూతురు అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్ కుమార్ తెలిపారు.

పాముకాటుకు వృద్ధుడి బలి

మొయినాబాద్: పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందాడు. మొయినాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన కడుమూరి కృష్టారెడ్డి(62) ఈ నెల 3న సాయంత్రం తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. వరిచేను గట్లపై ఆయన తిరుగుతుండగా ఓ పాము కాటు వేసింది. ఈ విషయాన్ని ఆయన కుమారుడు మల్లారెడ్డికి చెప్పడంతో వెంటనే స్థానికంగా ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున కృష్టారెడ్డి మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అమిత్‌షా సభను విజయవంతం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు



వికారాబాద్‌లో అమిత్‌షా బహిరంగసభా స్థలిని పరిశీలిస్తున్న మాధవరెడ్డి తదితరులు

అనంతగిరి: ఈ నెల 11న వికారాబాద్‌లోని ఎస్ఏపీ కళాశాల మైదానంలో ఉదయం 10గంటలకు నిర్వహించనున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాజస్థాన్ ఎమ్మెల్యే చరణ్‌సింగ్ రాజ్‌పురోహిత్ పిలుపునిచ్చారు. మంగళవారం సభాస్థలిని పరిశీలించి ఏర్పాట్లపై వారు ముఖ్య నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ఎక్కడికి వెళ్లినా ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారన్నారు. మోడీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆశయాలకు అనుగుణంగా పనిచేసే మోడీకి మరోసారి ప్రధానిగా పట్టంకట్టాలన్నారు. చేవెళ్ల ఎంపీగా కొండాను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కేపీ రాజు, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వడ్ల నందు, అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పోలింగ్‌కు అదనపు సమయం



మాట్లాడుతున్న ఆర్డీఓ సూరజ్‌కుమార్ తదితరులు

- ఎండల దృష్ట్యా గంట పెంపు
- ఆర్డీఓ సూరజ్‌కుమార్

కందుకూరు: ఓటర్ స్లిప్పుల పంపిణీ 96 శాతం పూర్తయిందని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సూరజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుందన్నారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక గంట అదనంగా పెంచామన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో 537 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇప్పటివరకు 4,624 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. బుధవారం వరకు సమయం ఉందన్నారు. వయోవృద్ధులు, వికలాంగులు, 234 మంది ఉన్నారని, వారిలో 98 శాతం ఓటు హక్కును ఉపయోగించుకున్నారని తెలిపారు. పోలింగ్ సిబ్బంది కోసం 128 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. 751 ఈవీఎం ప్యాడ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 56 పోలింగ్ బూత్‌లను సమస్యాత్మకంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ ప్రాంతాల్లో రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకుని, పోలీస్ నిఘా నిరంతరం కొనసాగించనున్నామన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన కారణంగా సరూర్‌నగర్ స్టేడియాన్ని ఏ రాజకీయ పార్టీలకు ఇవ్వడానికి అనుమతిలేదన్నారు. సమావేశంలో ఆయనతో నాయబ్ తహసీల్దార్ శేఖర్ పాల్గొన్నారు.

గ్యారంటీలను అమలు చేస్తాం



పరిగి: ఎన్నికల ప్రచారంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ



పూడూరు:మన్నెగూడలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కుల్కచర్ల: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలో ఉపాధికూలీల దగ్గరకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగుబలహీనవర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. నిరుపేదల సంక్షేమానికి ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేయడంతో పాటు, ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. కుల్కచర్ల మండలం పీరంపల్లి గ్రామంలో మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆనందం, నాయకులు జోగు వెంకటయ్య, కుమ్మరి స్వామి, మోత్కూరు వెంకటేశ్, రాంరెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన గ్యారంటీలను అమలు చేసింది

పరిగి: గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలను వందరోజుల్లో అమలు చేసిందని డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని న్యామత్‌నగర్‌లో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తూ, ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం అందిస్తుందన్నారు. దేశ ప్రజలు కాంగ్రెస్ పాలననే కోరుకుంటున్నారన్నారు. దేశంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సేనని అన్నారు. కాంగ్రెస్ అంటేనే సంక్షేమం, అభివృద్ధి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆనేం ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కేంద్రంలో కాంగ్రెస్సే రావాలని డీసీసీ ఉపాధ్యక్షుడు కద్మూరు ఆనందం పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్నేగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల పాలనలో ఈ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాలో బీఆర్ఎస్ అధికారం చేపట్టిన నాటి నుంచి ఉద్యోగ నియామకాలు లేవు, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి ఎవరికి మంజూరు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యోగాలు, ఏకకాలంలో రుణమాఫీ, పేద విద్యార్థుల కోసం ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందించారని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు పెంటయ్య ,శ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అజీంపటేల్, మండల అధ్యక్షుడు సురేందర్, బాలమణి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని గెలిపించండి

పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి



నాగారంలో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

ధారూరు: ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఆయన ధారూరు మండలంలోని నాగారం, నాగసమందర్ గ్రామాల్లో స్పీకర్ తనయ అనన్య చేతన్, ఎంపీ తనయుడు సిద్ధార్థరెడ్డి, ఇతర పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ నాయకత్వంలో జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని బలపర్చి హస్తం గుర్తుకు ఓటేయాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా వాలిబాల్ అసోషియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, నాగారం మాజీ సర్పంచు కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులకు మోదీ చెక్ పెట్టారు



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్: దేశంలో 2014కు ముందు పెద్ద ఎత్తున ఉగ్రదాడులు జరిగేవని మోదీ ప్రధాని అయిన తర్వాత ఒక్క దాడికి కూడా తావు లేకుండా చేశారని కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో సీనియర్ నేత పాదూరి కరుణ ఏర్పాటు చేసిన కాలనీ వాసుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన కరెన్సీని ఇతర దేశాల్లో ముద్రించి ఐఎస్ఐ ద్వారా ఇండియాలో కూడా చలామణి చేశారని, ఐఎస్ఐని దెబ్బతీయడంలో పెద్ద నోట్ల రద్దు కూడా ఒక భాగమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి ఏమీ దొరకక ఏదో ఒకటి ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పది లక్షల కోట్ల అభివృద్ధికి రేవంత్‌కు గాడిద గుడ్డులా కనిపిస్తోందని దుయ్యబట్టారు. తెలంగాణలో ఈ ఎన్నికల్లో బీజేపీ రెండంకెల సంఖ్యను అందుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నారెడ్కో కౌన్సిల్ ప్రెసిడెంట్ పాదూరి రవికాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్ అధ్యక్షుడు వైవై.రెడ్డి, రాజ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలనీ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షురాలు ప్రవీణా రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దివ్యాంగులకు సంక్షేమం

- రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య



ర్యాలీలో పాల్గొన్న వీరయ్య తదితరులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కోరారు. ఆయన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, పెరిక కులస్తుల తరఫున చేపట్టిన విజయ సంకల్పయాత్ర-2 మంగళవారం ఆమనగల్లు పట్టణానికి చేరుకుంది. ఈ మేరకు పట్టణంలో మల్లు రవికి మద్దతుగా దివ్యాంగులు వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే దివ్యాంగులకు సంక్షేమాభివృద్ధి జరిగిందన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులకు, చేనేత కార్మికులకు మొట్ట మొదటగా పెన్షన్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. వీరికి హోం హస్టల్స్, ఉద్యోగంలో రిజర్వేషన్‌లు, ఆసరా లేని వృద్ధులకు, వితంతువులకు ఇళ్లలో రిజర్వేషన్లు ఇచ్చిందన్నారు. వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. అలాగే అంత్యోదయ కార్డులు ఇచ్చి 35 కిలోల రేషన్ బియ్యం అందించిందని గుర్తు చేశారు. గ్రామాల్లో వలసల నివారణకు పేదలకు పని కల్పించేందుకు ఉపాధిహామీ పథకం తీసుకువచ్చిందన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో6 అంశాలను పొందుపరిచిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు దివ్యాంగుల సంక్షేమంపై ఏమాత్రం దృష్టి సారించలేదన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో మల్లు రవిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డు శంకర్, పార్టీ గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు దేశగాని సతీశ్‌గౌడ్, పెరిక కుల కార్పొరేషన్ సాధన నాయకుడు కోట మల్లికార్జున్‌రావు, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ అనితావిజయ్, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, నాయకులు కృష్ణనాయక్, శ్రీశైలం, విజయ్‌రాథోడ్, వెంకటయ్యగౌడ్, సత్యనారాయణగౌడ్, గణేశ్, కొండల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.